మెట్రో ఛార్జీలు పెంచొద్దు

- ఒప్పందానికి అనుగుణంగా ప్రస్తుత ఛార్జీలు తగ్గించాలి
- ఛార్జీల పెంపు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలి - సిపిఎం
- లేబర్ సెస్ చెల్లించని ఎల్అండ్‌టి సంస్థ
- ఫేర్ ఫిక్సేషన్ కమిటీ చైర్మెన్‌కి మెయిల్ ద్వారా లేఖ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎం ధశరథ్, ఎం మహేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెట్రో రైలు చార్జీలను పెంచొద్దని, ప్రస్తుత చార్జీలను ఒప్పందానికి అనుగుణంగా తగ్గించాలని ఫేర్ ఫిక్సేషన్ కమిటీ చైర్మెన్‌కు సిపిఎం విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్ మెట్రో రైల్ చార్జీల సవరణ కోసం ప్రయాణికుల అభిప్రాయాలు కోరిన నేపథ్యంలో ఫేర్ ఫిక్సేషన్ కమిటీ చైర్మెన్‌కు సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ ఈ మెయిల్ ద్వారా లేఖ పంపారు. ఈ మేరకు శుక్రవారం గోల్కొండ క్రాస్‌రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం ధశరథ్, ఎం మహేందర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మెట్రో రైల్ ప్రయాణికుల నుంచి ప్రస్తుతం వసూలు చేస్తున్న చార్జీలు అధికంగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందానికి విరుద్ధంగానూ ఉన్నాయని చెప్పారు. ఒప్పందం ప్రకారం కనిష్ట ధర రూ.ఎనమిది, గరిష్టంగా రూ.19గా ఉండాలని.. కానీ 2017 నుంచి కనీస చార్జీ రూ.పది, గరిష్ట చార్జి రూ.60 వసూలు చేస్తున్నారని తెలిపారు. ఒప్పందం ప్రకారం కనీస చార్జీపై ఏటా 5శాతం పెంచుకునే అవకాశం ఉందని, ఒప్పందంతో సంబంధం లేకుండా మెట్రోరైల్ ప్రారంభం నుంచే చార్జీలను దాదాపు 71శాతం అదనంగా ఎల్అండ్‌టీ సంస్థ వసూలు చేస్తోందన్నారు. ఒప్పందానికి విరుద్ధంగా వసూలు చేస్తున్న ఈ చార్జీలను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత మెట్రో రైల్ చార్జీలను సామాన్య ప్రయాణీకులు, అసంఘటితరంగ కార్మికులు భరించగలిగే స్థితిలో లేరని, మళ్లీ అదనంగా చార్జీలు పెంచే ప్రతిపాదన ఆమోదించొద్దని కోరారు. 2018 నాటికి 17లక్షల రైడర్ షిప్ చేరుతుందని మెట్రోరైల్ ఎండి కేంద్ర ప్రభుత్వానికి చెప్పారని, 2024 నాటికి 24లక్షలు దాటుతుందని అంచనా వేశారని శ్రీనివాస్ అన్నారు. ఇప్పటి వరకూ నాలుగు లక్షలు దాటలేదని గుర్తుచేశారు. ఈ సమయంలో చార్జీలు పెంచితే రైడర్ షిప్ మరింత తగ్గిపోతుందన్నారు. మెట్రో ప్రయాణీకుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని, రైళ్ల ఫ్రీక్వెన్సీ.. బోగీల సంఖ్య పెంచాలని కోరారు. ఒప్పందం ప్రకారం ఎల్ అండ్‌టీ సంస్థ రాష్ట్ర ప్రభుత్వం నుంచి 267 ఎకరాల భూమిని, కేంద్రం నుంచి రూ.1458 కోట్ల వయాబులిటీ గ్యాప్ ఫండ్ తీసుకుందన్నారు. భూములు, నిధులు తీసుకున్న కాంట్రాక్ట్ సంస్థ ఒప్పందంలోని చార్జీలను అమలు చేయకుండా కేంద్ర మెట్రోరైల్ చట్టం పేరుతో అడ్డగోలుగా చార్జీలు పెంచిందని, మళ్లీ ఇప్పుడు పెంచాలని ప్రతిపాదిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వాణిజ్యపరంగా అనుకున్న లక్ష్యాలు సాధించలేదు..

పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా ఈ ప్రాజెక్టును నడపాలని ఒప్పందం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఆదాయం టికెట్ ద్వారా 50శాతం, రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా 45 శాతం, వాణిజ్య ప్రకటనల ద్వారా ఐదు శాతం పొందుతామని మెట్రో అధికారులు ప్రకటించారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా 18.5 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్న కాంట్రాక్టు సంస్థ ఇప్పటివరకు 1.3 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని మాత్రమే అభివృద్ధి చేసిందని చెప్పారు. వాణిజ్యపరంగా అనుకున్న లక్ష్యాల్లో పది శాతమూ సాధించలేదన్నారు. కానీ, టిక్కెట్ రేట్లు పెంచి లాభం పొందాలని చూడటం సమంజసం కాదన్నారు. మెట్రో రైల్ నిర్మాణానికి రూ.20 వేల కోట్లకుపైగా ఖర్చయిందని, ప్రాజెక్టుకైన ఖర్చులో ఒక శాతం లేబర్ సెస్ చెల్లించాలని గుర్తుచేశారు. కానీ ఎల్అండ్‌టి సంస్థ లేబర్ సెస్ చెల్లించకుండా ఎగవేసిందన్నారు. వడ్డీతో కలిపి కనీసం రూ.300 కోట్లు నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కార్మిక శాఖకు సెస్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించాలని ఆయన ఫేర్ ఫిక్సేషన్ కమిటీని కోరారు.


పత్తి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మూడ్ శోభన్

దళారుల దోపిడీతో రైతులకు తీవ్ర నష్టం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారుల దోపిడీకి పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని పత్తియార్డును తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం సందర్శించి రైతులతో మాట్లాడి ధరల వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 75,400 క్వింటాళ్ల పత్తిని ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేశారని తెలిపారు. అంతర్జాతీయంగా పత్తికి మంచి డిమాండ్ ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను సాకుగా చూపుతూ ప్రయివేటు వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై క్వింటాకు రూ. ఏడు వేల నుంచి రూ.8,600 లోపు ధర పెట్టి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం పత్తికి క్వింటాకు కనీసం రూ.12 వేలు మద్దతు ధర ఉండాలని డిమాండ్ చేశారు. 2017 సంవత్సరం జిఒను అనుసరించి రైతులకు ఒక్కో గన్నీ బ్యాగుకు రూ.60 చెల్లించాలని కోరారు. 2017 నుంచి ఇప్పటివరకు 1.50 వేల బ్యాగులకు రైతులు సుమారు రూ. కోటి నష్టపోయినట్టు తెలిపారు. మార్కెట్ నిబంధనల ప్రకారం కమిషన్ రెండు శాతం వసూళ్లు చేయాల్సి ఉండగా అదనంగా మరో రెండు శాతం వసూలు చేస్తూ రైతును నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. అనంతరం మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి బివి రాహుల్‌ను కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి. కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల మురళి, సహాయ కార్యదర్శి చల్ల నర్సింహా రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఓదెలు, బషీర్, జన్ను సురేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఆ సంస్థ చైర్మెన్, ఎమ్మెల్యే గోవర్ధన్‌కు సిఐటియు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆర్టీసి కార్మికుల పే స్కేల్, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు వారు టిఎస్ ఆర్‌టిసి చైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌కు లేఖ రాశారు. 2019 జులై నుంచి కార్మికులకు బకాయిపడ్డ ఏడు డిఎలలో ఐదింటిని అమలు చేయడం, సమ్మెకాలపు జీతాన్ని చెల్లిస్తూ ఉత్తర్వులివ్వడం, పండుగ అలవెన్స్‌లు ఇప్పించడం లాంటివి మంచి పరిణామాలని పేర్కొన్నారు. అయితే, బకాయిపడ్డ 2017, 2021 వేతన ఒప్పందాలను వెంటనే అమలు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రతపై 2021లో విడుదల చేసిన మార్గదర్శకాలలో మార్పులు చేయాలని సూచించారు. సంస్థలో యూనియన్ల కార్యకలాపాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అనుసరిస్తున్న తీరుతో సిసిఎస్ తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటోందని వాపోయారు. సిసిఎస్ నిర్వహణలో నష్టం వస్తే దానికి బాధ్యత మేనేజింగ్ కమిటీ వహించాలని కోరారు. సిసిఎస్‌కు రావాల్సిన రూ. 887 కోట్లను (అసలు, వడ్డీ కలిపి), నెలవారీగా చేస్తున్న రికవరీలను సంస్థ జమచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసి కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాత కక్షలతో యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత కక్షలతో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం చిన్నచెల్మెడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం.. చిన్నచెల్మెడ గ్రామానికి చెందిన తలారి ప్రవీణ్, బేగరి ఆనంద్ స్నేహితులు. కాగా, ప్రవీణ్ (22)ను ఆనంద్ 2020 అక్టోబర్ 30న గ్రామ శివారులోని పత్తి చేనులో నరికి చంపిన విషయం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా ప్రాణానికి ప్రాణం తీయాలనే కసితో ప్రవీణ్ కుటుంబ సభ్యులు సమయం కోసం వేచి చూశారు. శుక్రవారం ఉదయం ఆనంద్(28) గ్రామంలో ఒంటరిగా తిరుగుతున్నట్టు ప్రవీణ్ కుటుంబ సభ్యులు సమాచారం అందుకున్నారు. వెంటనే కారం, మారణాయుధాలతో వెళ్లి మూకుమ్మడిగా ఆనంద్‌పై దాడి చేశారు. ఆనంద్ కళ్లల్లో కారం చల్లి.. తల, మొండం, రెండు చేతులు నరికేశారు. దాంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన ఆనంద్ తమ కళ్ల ముందు తిరగడాన్ని జీర్ణించుకోలేకనే హత్య చేసినట్టు పోలీసుల ముందు నిందితులు ఒప్పుకున్నట్టు తెలిసింది. సంఘటనా స్థలాన్ని కొండాపూర్, మునిపల్లి సిఐ సంతోష్‌కుమార్ పరిశీలించారు. హత్యకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు నిందితులు తలారి అంబయ్య, స్వరూప, తలారి ప్రభుదాస్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వే బ్రిడ్జిల్లో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ మిర్యాలగూడ మండలం యాద్గారిపల్లి గ్రామంలో శుక్రవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. శ్రీలక్ష్మీ ప్రసన్న రైస్‌ఇండస్ట్రీ, వైష్ణవి ఫుడ్ ప్రొడక్ట్, సాయితేజ రైస్‌మిల్లులను తనిఖీ చేసి వే బ్రిడ్జీలను పరిశీలించారు. కాంటాల్లో సాంకేతిక సమస్యలు సృష్టించి తూకాల్లో మోసం చేస్తున్నారని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ అధికారి రామకృష్ణ హెచ్చరించారు. తూకంలో మోసం జరిగినట్టయితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణారెడ్డి, ఆర్ఐ సురేందర్‌సింగ్ ఉన్నారు.

జాలికట్టిన బియ్యం తిని విద్యార్థుల అస్వస్థత

- మధ్యాహ్న భోజనం వికటించిన వైనం
- పరిశీలించిన డిఎంఅండ్‌హెచ్ఓ సుదర్శన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులకు నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాల్సింది పోయి జాలి కట్టిన బియ్యం పంపిణీ చేయడంతో అది తిని 42 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో మధ్యాహ్నం బియ్యం అయిపోవడంతో ఎండిఎం కార్మికులు స్థానిక మోడల్ పాఠశాల నుంచి బియ్యం తెప్పించుకొని వంట చేయగా మధ్యాహ్నం మూడు గంటల తర్వాత విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు వాంతులు చేసుకోవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. సమాచారం మేరకు డిఎంఅండ్‌హెచ్ఓ సుదర్శన్ ఘటనా స్థలానికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. కడుపునొప్పి, తలనొప్పితో విద్యార్థులు బాధపడుతుండగా ప్రథమ చికిత్స చేయగా 36 మంది విద్యార్థులు సాధారణ స్థితిలో ఉన్నారని తెలిపారు. ఆరుగురు మూడు, నాలుగు సార్లు వాంతులు చేసుకోవడంతో మెరుగైన చికిత్స చేస్తున్నామని, విద్యార్థుల పరిస్థితి అదుపులోనే ఉందని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్ఓ పాఠశాలకు వెళ్లి పరిశీలించగా జాలి కట్టిన బియ్యం ఉన్నాయి. అలాగే పది రోజుల నుంచి విద్యార్థులు వాటర్ ట్యాంక్ నీళ్లే తాగుతుండటంతో నీళ్లతో పాటు బియ్యం, వంటకు ఉపయోగించిన సామగ్రిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షల నిమిత్తం తీసుకెళ్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ వీర్‌సింగ్, ప్రధానోపాధ్యాయులు అనురాధ, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.


అస్వస్థతకు గురైన విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

కెసిఆర్ హామీలపై పోరాడతాం

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఆట మొదలైందనీ, కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అడుగడుగునా నిలదీస్తూ తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ పర్యటనకు సిఎం కెసిఆర్ దూరంగా ఉండటం సరికాదని అభిప్రాయపడ్డారు. రాజకీయాలను, అభివృద్ధి కార్యక్రమాలను వేరువేరుగా చూడాలని హితవుపలికారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త టెక్నాలజీతో రామగుండం ఎరువుల కర్మాగారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి జాతికి ప్రధాని మోడీ అంకితం చేయబోతున్నామని తెలిపారు. అదే వేదిక నుంచి జాతీయ రహదార్లు, రైల్వే లైన్ ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో చేసిన పనులకు బిల్లులు అందక కాంట్రాక్టర్లు ధర్నాలు చేస్తున్నారనీ, లబ్దిదారులకు ఏ ఒక్కటీ సకాలంలో అందట్లేదని అన్నారు. కనీసం మహిళ అని చూడకుండా గవర్నర్‌తో కవ్వింపు చర్యలకు పాల్పడటం, ప్రోటోకాల్ పాటించకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు, శంకుస్థాపనకు ప్రధాని రావొద్దని ఫ్లెక్సీలు పెట్టడం దుర్మార్గమన్నారు. టిఆర్ఎస్ చేతగానీ తనంతోనే మెడికల్ కాలేజీలు రాలేదన్నారు. ఇప్పటి వరకు గిరిజన మ్యూజియానికి భూమి ఇవ్వలేదని తెలిపారు. సిట్‌లు ప్రగతిభవన్‌లో సిట్ అయ్యాయని విమర్శించారు. దమ్ముంటే ఎమ్మెల్యేకు ఎర కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు.



లేటెస్ట్ అడ్వాన్స్ ఐవిఎఫ్ ప్రొసీజర్స్‌ను ప్రారంభిస్తున్న నటీ ఆమని

సంతానలేమిపై అవగాహన పెరగాలి

ఫర్టీ 9లో అత్యాధునిక చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

సంతానలేమిపై మహిళల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, వంధ్యత్వ సమస్యలకు ఫర్టీ 9లో అత్యాధునిక చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్ సి జ్యోతి తెలిపారు. మాతృత్వం మహిళలకు ఓ వరమని, సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రస్తుతం సరికొత్త పరిజ్ఞానంతో వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. సికింద్రాబాద్‌లోని ఎన్‌సిఎల్ బిల్డింగ్ లో ఉన్న ఫర్టీ 9 సెంటర్‌లో శుక్రవారం ప్రముఖ సినీ నటి ఆమని లేటెస్ట్ అడ్వాన్స్ ఐవిఎఫ్ ప్రొసీజర్స్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం, వాతావరణంలో మార్పులు, వృత్తిపరమైన జీవితం, పెరిగిన ఒత్తిడి, పిల్లలు లేని సమస్య ప్రబలంగా ఉన్నాయన్నారు. ఈ సెంటర్‌లో పిల్లలు లేని కారణాలను సరైన రోగ నిర్ధారణతో ఆధునిక వైద్య విధానాల సహాయంతో వైద్య శాస్త్రంలో తాజా సాంకేతిక ఆవిష్కరణల ద్వారా తగిన చికిత్సను అందించి ఈ కీలకమైన సమస్యను వేగంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. సంతాన లేని సమస్యల కోసం ఫర్టీ 9 అత్యాధునిక అడ్వాన్స్ ఐవీఎఫ్ పద్ధతులను ఆస్ట్రేలియన్ యూనివర్సిటీ సహకారంతో అందిస్తోందన్నారు.

ఆలిండియా ఆర్‌పిఎఫ్ బ్యాండ్ పోటీలో దక్షిణ మధ్య రైల్వే విజయం

- బహుమతులను అందజేసిన జిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభిన్న సంస్కృతులకు ఆలవాలమైన మన దేశంలో సంగీతం ఒక బంధన శక్తిగా పనిచేస్తోందని, శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంచడంలో అది కీలక పాత్ర పోషిస్తున్నదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. హైదరాబాద్‌లోని ఆర్‌పిఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం 11వ ఆలిండియా ఆర్‌పీఎఫ్ బ్యాండ్ పోటీల ముగింపు వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారామ్, సీనియర్ రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ బ్యాండ్ కాంపిటీషన్ అనేది కేవలం ఎవరు బెస్ట్ అని నిర్ణయించే కార్యక్రమం కాదనీ, ఇది ఐక్యత, సమన్వయ ప్రదర్శన అన్నారు. దేశ నిర్మాణం వైపు ఆత్మీయ కవాతు అని చెప్పారు. విజేతలను అభినందించారు. వివిధ జోన్ల నుంచి మొత్తం 14 బృందాలు, 227 మంది బ్యాండ్ సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు.

పిల్లల్లో జ్ఞాపకశక్తి పెంచేది పుస్తకమే..

- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం
- 'నవ తెలంగాణ' పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుస్తక పఠనంతో పిల్లల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం హన్మకొండలో 'నవ తెలంగాణ' పబ్లిషింగ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన బాలల పుస్తక ప్రదర్శనను చైర్మెన్ సుందర్ రాజ్ యాదవ్, కార్పొరేటర్ మామిండ్ల రాజు, సిపిఎం నాయకులు వాసుదేవారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. సెల్ ఫోన్, కంప్యూటర్ వాడకం ఎక్కువైపోయిన ఈ తరుణంలో సైన్స్, విజ్ఞానదాయక పుస్తకాలు ప్రచురించి పిల్లల్లో దేశభక్తి-విజ్ఞానం పెంపొందించేందుకు ఎన్నో విలువైన పుస్తకాలతో నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఇలాంటి ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు.

నగర ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పుస్తకాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మెన్ అజీజ్ ఖాన్, సిఐటియు నాయకులు వేల్పుల సారంగపాణి, బొట్ల, చక్రపాణి, మెడికల్ యూనియన్ నాయకులు డిజి శ్రీనివాస్, నవ తెలంగాణ జనరల్ మేనేజర్ వాసు, దేవేందర్‌రావు, కృష్ణారెడ్డి, వరంగల్ బుక్‌హౌస్ మేనేజర్ బాబు, లంక పాపిరెడ్డి, తిరుపతిరెడ్డి, సారంగపాణి, శ్రీనివాస్, మేధావులు, కళాకారులు పాల్గొన్నారు.



బాలల పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న దృశ్యం



పేట్లబుర్జు ఆస్పత్రిపై ఎంపి సంతోష్ రూ. కోటి విరాళం

- మంత్రి హరీశ్‌రావు అభినందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను జన్మించిన పేట్ల బుర్జు ఆస్పత్రి అభివృద్ధికి రాజ్యసభ ఎంపి జోగినిపల్లి సంతోష్‌కుమార్ రూ.కోటి కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి. హరీశ్‌రావు అభినందించారు. "కన్న తల్లిని, జన్మ భూమిని మరువద్దు అంటారు. ఇదే బాటలో రాజ్య సభ సభ్యుడు జోగినపల్లి సంతోష్, ఆయన పుట్టిన పేట్ల బుర్జు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి కోటి రూపాయలు కేటాయించడం సంతోషం. ఆయన పుట్టిన ఆస్పత్రిని మర్చిపోకుండా గుర్తుపెట్టుకుని, అభివృద్ధి కోసం నిధులు ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయం." అని మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్ నిర్ణయం ఎంతో మందికి స్ఫూర్తిని కలుగజేసి, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి ముందుకొచ్చేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ నిధులతో పేట్లబుర్జు ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సంతోష్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన వారు, ఆయా ఆస్పత్రుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. పేట్ల బుర్జు ఆస్పత్రి అవసరాలు, సౌకర్యాలు తీర్చేలా ఈ నిధులను వినియోగించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

దక్షిణాదిలో భారీ విస్తరణపై ప్రిస్టన్ కేర్ దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆరోగ్య సేవలను అందించే ప్రిస్టిన్ కేర్ 2023 చివరికి దక్షిణ భారతదేశంలో 300 ఆసుపత్రులు, 100 క్లినిక్‌లను చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించింది. ఈ విస్తరణతో తన నెట్‌వర్కులో ఆసుపత్రులను 500కు, క్లినిక్‌లను 150కు పెంచుకోనున్నట్లు వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సహా దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాల్లోని కీలక నగరాల్లో కార్యకలాపాలు కలిగి ఉన్నట్లు తెలిపింది. సాధారణ శస్త్రచికిత్స, ఆప్తమాలజీ, ఇఎన్‌టి, యూరాలజీ, గైనకాలజీ తదితర 12 శస్త్ర చికిత్సల విభాగాల్లో కంపెనీ పని చేస్తుండగా, దంత వైద్య విభాగానికి తన సేవలను విస్తరించే యోచనలో ఉన్నామని ప్రిస్టిన్ కేర్ సహ-వ్యవస్థాపకుడు హర్‌సిమర్‌బిర్ సింగ్ తెలిపారు.

నిబంధనలు పాటించని అటానమస్ కాలేజీలు

- టిఎస్‌టిసిఇఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అటానమస్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు తాము రూపొందించిన మార్గదర్శకాలను అమలు చేయాలంటూ జేఎన్టీయూహెచ్ ఆదేశాలు జారీ చేసిందని టిఎస్‌టిసిఇఎ అధ్యక్షులు అయినేని సంతోష్‌కుమార్ తెలిపారు. వాటిని అమలు చేయాలనడం సంతోషమే కానీ ఇప్పటికే ఉన్న కనీస నిబంధనలను ఆయా కాలేజీలు అమలు చేయడం లేదనే విషయాన్ని గుర్తించాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నిబంధనలు పేపర్‌పైనే ఉంటాయనీ, ప్రత్యక్షంగా అవి అమలు కావడం లేదని పేర్కొన్నారు. అటానమస్ కాలేజీల్లో పరీక్షల విభాగం ప్రశ్నలను ముందుగానే ఇవ్వడం, అవే ప్రశ్నాపత్రాలను రూపొందించడం ఎన్నో సందర్భాల్లో చూశామని తెలిపారు. దాని ద్వారా విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. మొదటి ఏడాదిలో ఎక్కువ శాతం మంది విద్యార్థులను ఫెయిల్ చేస్తున్నారని తెలిపారు. అయితే చివరి ఏడాది వచ్చే వరకు 95 శాతం మంది ఉత్తీర్ణత పొందుతున్నారని పేర్కొన్నారు. దీనిపై వర్సిటీ అధికారులు మరింత దృష్టి సారించాలనీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 55వ గ్రంథాలయ స్వర్ణోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ శ్రీనివాసచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న హైదరాబాద్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, డిసిబి చైర్మన్ మనోహర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, సదస్సులు, సాంస్కృతిక పోటీలతోపాటు విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

పసికందుతో సహా తల్లి ఆత్మహత్య

భర్త వేధింపులే కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ తన పది నెలల పసికందుతో సహా వ్యవసాయ బావిలోదూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన హనుమకొండ జిల్లా దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరుగొండలో శుక్రవారం జరిగింది. బాధితురాలి తల్లి రావుల సరళ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండలం హౌస్ బురుగు గ్రామానికి చెందిన నిమ్మల ఆమని (29)ని ఆమె భర్త మురళి నిత్యం కట్నం డబ్బులు తీసుకురావాలని వేధిస్తుండేవాడు. దానికి తోడు ఆడపిల్ల పుట్టిందన్న నెపంతో ఇంకా వేధింపులకు గురిచేసేవాడు. వేధింపులు భరించలేక ఆమని, తన కూతురు అశ్వితసాయి (10నెలలు)తో సహా ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు మురళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హరిప్రియ, సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) 104 వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఆ బ్యాంక్ శాఖల్లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నగరంలోని ఆర్‌టిసి కళాభవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో యుబిఐ కీలక అధికారులు సహా ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుబిఐ హైదరాబాద్ జోన్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర తెలి మాట్లాడుతూ.. తమ బ్యాంక్ విజయవంతంగా 103 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ బ్యాంక్ ఎండి, సిఇఒ మనిమెకలయి ఖాతాదారుల కోసం పది కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించారని తెలిపారు. నిజామాబాద్ రీజినల్ ఆఫీసులోనూ ఆ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

Knight Frank

హైదరాబాద్‌లో తగ్గిన నివాస అమ్మకాలు

- నైట్‌ఫ్రాంక్ రిపోర్టు

హైదరాబాద్ : రాష్ట్ర రాజధానిలో రియాల్టీ అమ్మకాల్లో పతనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో నివాస గృహాల అమ్మకాలు 18 శాతం పడిపోయి 4,597 యూనిట్లుగా నమోదయ్యాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 5,633 యూనిట్ల విక్రయాలు జరిగాయని పేర్కొంది. విలువపరంగా గత నెలలో రూ.2,237 కోట్ల ఆస్తులు రిజిస్టర్ అయ్యాయి. గతేడాది ఇదే నెలలో రూ.2,468 కోట్ల అమ్మకాలు జరిగాయి. హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్‌లో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలను పరిగణలోకి తీసుకుని నైట్‌ఫ్రాంక్ ఈ రిపోర్టును రూపొందించింది.

పేదల గుడిసెలు తొలగింపు అమానుషం



- అక్రమ కేసులను ఎత్తేయాలి
- ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా కందుకూరు, నాగర్‌కర్నూల్ జిల్లా ఎత్తం గ్రామంలో గత ప్రభుత్వాలు పేదలకు ఇంటి పట్టాలిచ్చి స్థలాలను చూపలేదని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. పట్టాలున్న నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే వాటిని తొలగించడం అమానుషమని విమర్శించింది. గుడిసెలు వేసుకున్న వారిని అక్రమంగా అరెస్టులు చేసి, పోలీసు స్టేషన్లలో నిర్బంధించి కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించింది. ఆయా స్థలాల్లో ఇండ్లు కట్టుకోవడానికి ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లాలో మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రం సర్వే నెంబర్ 788లో 5.20 ఎకరాల్లో 183 మంది నిరుపేదలకు 60 గజాల చొప్పున 2007లో అప్పటి ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలకు పట్టాలిచ్చిందనీ, కానీ స్థలం చూపలేదని తెలిపారు. ఆ స్థలాన్ని కొంత మంది అక్రమంగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దీంతో 450 మంది పట్టాలున్న వారితోపాటు, ఇండ్లు లేనివారు గుడిసెలు వేసుకుని అక్కడే నివసిస్తున్నారని పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండలం ఎత్తం గ్రామంలోని సర్వే నెంబర్ 289, 334లో 11.33 ఎకరాల్లో 1996లో 201 మందికి ప్రభుత్వం పట్టాలిచ్చి, స్థలం చూపలేదని వివరించారు. ఆ స్థలంలో రైతు వేదిక, కరెంట్ జంక్షన్, నర్సరీని 1.20 ఎకరాల్లో ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. మిగిలిన స్థలంలో పట్టాలున్నవారే గుడిసెలేసుకున్నారని పేర్కొన్నారు. ఆ రెండు కేంద్రాల పేదలు అనేక ఉద్యమాలను చేయడంతోపాటు, పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం రాలేదని విమర్శించారు. దీంతో ఆయా స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారని గుర్తు చేశారు. ఆ గుడిసెలను గురువారం తెల్లవారుజామున వందలాది మంది పోలీసులు జెసిబిలతో తొలగించారని తెలిపారు. మహిళలపై దాడులు చేశారని విమర్శించారు. కందుకూరులో సిపిఎం నాయకులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఎత్తం గ్రామంలో సిపిఎం నాయకులు బి.శ్రీనివాస్, ఎంపిటిసి శ్రీనివాసరావుతోపాటు మరో ఇద్దరిపై అక్రమంగా 307 కేసు నమోదు చేశారని వివరించారు. ఎంపిటిసిని జైలుకు పంపారని తెలిపారు. అదే విధంగా పోలీసులను అడ్డుకున్నారనే కారణంతో గ్రామ సర్పంచ్ వరలక్ష్మితోసహా, నాయకులపైనా, గుడిసెవాసులపైనా అక్రమంగా కేసులు పెట్టారని పేర్కొన్నారు. రెండు కేంద్రాల్లో పోలీస్ పికెట్ పెట్టి ఆ స్థలాల్లోకి పేదలు వెళ్లకుండా అడ్డుకుంటూ భయప్రభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి భూదందాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కానీ పేదలు తలదాచుకోవడానికి 60 గజాల్లో గుడిసెలు వేసుకుంటే వందలాది మంది పోలీసులతో దాడులు చేయడం సరైందికాదని పేర్కొన్నారు. తక్షణమే వారికి న్యాయం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ్మినేని డిమాండ్ చేశారు.

ఇడి సోదాల్లో రూ.1.08 కోట్ల నగదు స్వాధీనం

- 18న విచారణకు హాజరుకావాలి
- పలు గ్రానైట్ కంపెనీల యజమానులకు ఇడి నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత రెండు రోజులుగా హైదరాబాద్, కరీంనగర్‌లోని పలు గ్రానైట్ కంపెనీల కార్యాలయాలు, యజమానుల ఇళ్లలో జరిపిన సోదాల్లో రూ.1.08 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఇడి అధికారులు శుక్రవారం ప్రకటించారు. నేరపూరితమైన పత్రాలను కూడా సీజ్ చేశారు. పదేళ్లకు సంబంధించిన లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్నామని, సోదాల సందర్భంగా పలు బినామీ బ్యాంకు ఖాతాలను గుర్తించామని ఇడి అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్, కరీంనగర్‌లోని శ్వేత గ్రానైట్స్, శ్వేత ఏజెన్సీస్, ఎస్‌విజి ప్రైవేట్ లిమిటెడ్, పిఎస్‌ఆర్ గ్రానైట్స్, అరవింద్ గ్రానైట్స్, గిరిరాజ్ షిప్పింగ్ ఏజెన్సీస్‌తోపాటు వాటి అనుబంధ సంస్థల్లో సోదాలు నిర్వహించినట్టు ఇడి అధికారులు తెలిపారు. రాష్ట్ర విజిలెన్స్ శాఖ నివేదిక ప్రకారం ఈ గ్రానైట్ కంపెనీలు చేసిన ఎగుమతులకు, చెల్లించిన రాయల్టీకి భారీగా తేడాలు ఉన్నాయని, దీని ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇడి అధికారులు పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి విశాఖ, కాకినాడ మీదుగా ఓడరేవులు, రైలు మార్గం ద్వారా చైనా, హాంకాంగ్‌కు భారీగా ఎగుమతులు చేశారని.. రికార్డుల్లో మాత్రం తక్కువ మొత్తం చూపించారని ఇడి అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దీనివల్ల ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుముతో పాటు, రాయల్టీ నుంచి తప్పించుకున్నారని తెలిపారు. చైనాకు ఎగుమతి చేయగా వచ్చే నగదును గ్రానైట్ కంపెనీల యజమానులు తమ ఉద్యోగుల పేరు మీద బినామీ ఖాతాల్లో జమ చేయించారని పేర్కొన్నారు. ఇలా బ్యాంకు ఖాతాల్లోకి వచ్చిన డబ్బును రుణంగా తీసుకున్నట్టు చెబుతున్న యజమానులు, దానికి సంబంధించిన ధ్రువపత్రాలను చూపించలేకపోయినట్టు అధికారులు వెల్లడించారు. చైనాకు చెందిన లీవెన్ హ్యూ అనే వ్యాపారి ఖాతాల నుంచి గ్రానైట్ కంపెనీల యజమానుల ఖాతాల్లోకి నగదు బదిలీ అయిందని, పనామా లీక్స్‌లో లీవెన్ హ్యూ పేరుందని తెలిపారు. గ్రానైట్ కంపెనీలు ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించామని.. దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. పిఎస్‌ఆర్ గ్రానైట్స్ యజమాని పాలకుర్తి శ్రీధర్‌ను ఇడి అధికారులు కార్యాలయానికి పిలిచి ప్రశ్నించారు. అవసరమైనప్పుడు పిలిస్తే మళ్లీ రావాలని సూచించారు. మిగతా గ్రానైట్ కంపెనీల యజమానులను ఈ నెల 18వ తేదీన రావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు.

పోడు భూముల సర్వేను పూర్తి చేయాలి

- డిసెంబర్‌లో సాగుదారులకు హక్కు పత్రాలు
- కలెక్టర్లకు మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెలాఖరులోగా అన్ని జిల్లాల్లో పోడు భూముల సర్వేను పూర్తి చేసి, పట్టాలను సిద్ధం చేయాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సిఎస్ సోమేష్‌కుమార్, కలెక్టర్లు, పోలీసు, అటవీశాఖల అధికారులతో కలిసి ఆమె శుక్రవారం పోడు భూములపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామసభలను నిర్వహించి తీర్మానం కాపీలను డివిజన్, జిల్లా స్థాయి కమిటీలకు వెంటనే పంపాలన్నారు. నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్న లబ్దిదారులకు పోడు భూముల పట్టాలను వచ్చే నెల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం భావిస్తున్నదని స్పష్టం చేశారు. విజ్ఞాపనల వెరిఫికేషన్, సర్వేలను వెంటనే పూర్తి చేయడానికి అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 4.14 లక్షల క్లైయిములు అందాయనీ, ఇప్పటికే అధిక శాతం వెరిఫికేషన్ పూర్తయిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజనులకు అన్యాయం జరగొద్దని స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు మరింత సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో అడవులను సంరక్షించాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. పోడు భూములకు సంబంధించి మొత్తం వెరిఫికేషన్ ప్రక్రియను ఒక టీమ్ వర్క్‌తో పూర్తిచేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి సి.ఎస్ శాంతి కుమారి, ప్రిన్సిపల్ సిసిఎఫ్ దొబ్రీయల్ , గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివ్య దేవరాజన్, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడంలో ప్రభుత్వాలు విఫలం

- ఎఐఎఫ్‌ఆర్‌టిఇ చైర్‌పర్సన్ జగ్మోహన్‌సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



దేశంలో అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆలిండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ (ఎఐఎఫ్‌ఆర్‌టిఇ) చైర్‌పర్సన్ ప్రొఫెసర్ జగ్మోహన్‌సింగ్ విమర్శించారు. మూడురోజులపాటు కొనసాగనున్న ఎఐఎఫ్‌ఆర్‌టిఇ జాతీయ సమితి సమావేశాలు శుక్రవారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్న మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ చర్చి కాలనీలో ప్రారంభమయ్యాయి. జగ్మోహన్‌సింగ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ఒక పథకం ప్రకారం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అన్ని రంగాల్లో జాతీయీకరణ చేయాలని చెప్తూనే విద్యలో విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తున్నదని అన్నారు. విద్యా ప్రయివేటీకరణను బలోపేతం చేస్తోందని చెప్పారు. కొఠారి కమిషన్ ప్రకారం విద్యకు కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులను కేటాయించాలని ఉన్నా ఏనాడూ మూడు శాతానికి మించి కేటాయించడం లేదన్నారు. కోవిడ్ వల్ల బతుకు దుర్భరమైన పేదల పిల్లలు విద్యకు దూరమయ్యారని వివరించారు. ప్రభుత్వాలు వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తులు బ్యాంకు రుణాలను రూ.వేల కోట్లు కట్టకుంటే వాటిని ప్రభుత్వాలు మాఫీ చేస్తున్నాయని అన్నారు. పేదల విద్యకు మాత్రం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌ఆర్‌టిఇ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వికాస్ గుప్త, నాయకులు కె చక్రధర్‌రావు, హరగోపాల్, కె లక్ష్మీనారాయణ, మధుప్రసాద్, రమేష్ పట్నాయక్, కాత్యాయని విద్మహే, హరిజిందర్ సింగ్, ప్రసాద్, అశుతోష్ ముఖర్జీ, మల్లిగే, మాధురి, మీరా సంఘమిత్ర, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్ కుమార్, ముత్యాల రవీందర్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, పీడీఎస్‌యూ నాయకులు జూపాక శ్రీనివాస్, పరశురాం, విజయ్ ఖన్నా, అల్లూరి విజయ్, రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోడీ శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండానికి వస్తున్నారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి వచ్చి.. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా నేరుగా రామగుండానికి మధ్యాహ్నం 3.20 గంటలకు చేరుకోనున్నారు. ఆర్‌ఎఫ్‌సిఎల్‌ను సందర్శించి అనంతరం అక్కడే గంటపాటు అధికారులతో సమీక్షించనున్నారు. అక్కడి నుంచి ప్రజలనుద్దేశించి సభలో మాట్లాడనున్నారు. సుమారు రెండుగంటల పర్యటన అనంతరం తిరిగి బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ఈ క్రమంలో ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఇతర జిల్లాల నుంచి ఐదుగురు ఎస్‌పిలు, మరో ఐదుగురు అదనపు ఎస్‌పిలు, 25 మంది డిఎస్‌పిలు, రెండు వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. ప్రధాన మంత్రి భద్రతా సిబ్బంది సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్టు రామగుండం కమిషనరేట్ సిపి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

రేవంత్‌కు బక్క జడ్సన్ క్షమాపణలు

- భవిష్యత్‌లో పొరపాట్లు జరగవు
- పిసిసి క్రమశిక్షణ కమిటీకి జడ్సన్ హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డిపై తాను చేసిన ఆరోపణలకు చింతిస్తూ... పార్టీ ప్రధాన కార్యదర్శి బక్క జడ్సన్ క్షమాపణలు చెప్పారు. రేవంత్‌పై ఆరోపణల నేపథ్యంలో వివరణ ఇవ్వాలంటూ ఆయన్ను పిసిసి క్రమశిక్షణ కమిటీ కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో క్రమశిక్షణా కమిటీ చైర్మన్ జి చిన్నారెడ్డి, సభ్యులు శ్యామ్‌మోహన్, గంగారామ్ ముందు హాజరై, జడ్సన్ లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లు జరగబోవనీ, పార్టీ అభివృద్ధి కోసం అందరితో కలిసి చేస్తానని హామీ ఇచ్చినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టిఆర్‌ఎస్, బిజెపి ప్రభుత్వాల అకృత్యాలను, దుష్పరిపాలనను బట్టబయలు చేసేందుకు తన వద్ద అనేక ఆధారాలు, పత్రాల రూపంలో ఉన్నాయని జడ్సన్ వివరించారు. వాటికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ సంఘం సభ్యులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఇచ్చిన ఆదేశం, పార్టీ మార్గ దర్శకాలు ఉన్నప్పటికీ వాటిని అతిక్రమించి మీడియాకెక్కడం సరైందికాదని జడ్సన్‌ను హెచ్చరించారు. పార్టీ పరంగా ఏమైనా ఇబ్బందులొచ్చినా అధిష్టానంతో సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. పార్టీ అంతర్గత విషయాల గురించి ఎవరూ మీడియా వరకు వెళ్లకూడదని హితవు పలికారు. కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ బహిష్కరణ తగదు

- గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను అరెస్టు చేయాలి
- కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామంలో 80 గౌడ కుటుంబాలను బహిష్కరించిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కెజికెఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీకి రూ.5 లక్షల 20 వేలు ఇవ్వాలంటూ గీత కార్మికులను డిమాండ్ చేశారనీ, తాము అంత ఇవ్వలేమని చెప్పడంతో వారిని గ్రామం నుంచి బహిష్కరించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లాలో విడిసిల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయనీ, వారు చెప్పినట్టు వినకపోతే బహిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. విడిసిల వ్యవస్థను రద్దు చేయాలంటూ గతంలో అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విడిసి వ్యవస్థని పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు.

మునుగోడు ఓటమిపై అధిష్టానం సీరియస్

- రాష్ట్రంపై ప్రియాంకగాంధీ దృష్టి సారిస్తున్నారు
- ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నిక ఓటమిని పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుందని పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడం బాధాకరమని తెలిపారు. దీనిపై ఇప్పటికే జైరాంరమేష్, కెసి వేణుగోపాల్ తదితరులు ఆరా తీశారని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ పార్టీ ఓడిపోయిందనీ, వాటిపై పూర్తి స్థాయి సమీక్ష జరగలేదని చెప్పారు. మునుగోడు ఓటమిని సీరియస్‌గా తీసుకున్న అధిష్టానం... ప్రజలు ఎందుకు విశ్వసించడంలేదో, ఎందుకు ఓట్లు వేయడం లేదో, సభలకు జనం వస్తున్నా... వారంత ఇతర పార్టీలకు ఎందుకు ఓట్లు వేస్తున్నారో తదితర అంశాలపై చర్చించనుందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పరిస్థితులపై ఇప్పటికే ప్రియాంకగాంధీ సమీక్షించారనీ, మరో దఫా సీనియర్లతో చర్చించనున్నట్టు తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో పిసిసి చీఫ్, సిఎల్‌పి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు చాలా కష్టపడి పని చేశారన్నారు. అయినా కాంగ్రెస్ విజయం సాధించలేదనీ, ఎందుకు ఇలా జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన నేతలపై దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని కోరారు. టిడిపి బిసిలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించిందనీ, ఈ క్రమంలో కాంగ్రెస్‌లో ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు 50 శాతం పార్టీ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి దూరమైన వర్గాలను దరికి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీని ఓడించడమో, గెలిపించడమో అనేది ఒక నాయకడి చేతిలో ఉండదనీ, సమిష్టిగా కృషి ఫలితంగానే విజయావకాశాలు ఉంటాయని చెప్పారు.

గద్వాల ఘటనపై విచారణ చేపట్టాలి

- డిజిపికి ఐద్వా వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గద్వాలలో మహిళలు, యువతుల న్యూడ్ ఫొటోలు, వీడియోలకు సంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మితోపాటు ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, సభ్యులు ఎ.నర్మద శుక్రవారం హైదరాబాద్‌లో డిజిపి మహేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. వారంలోగా సంబంధిత వ్యక్తులను పట్టుకుంటామనీ, ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా సమగ్ర విచారణ జరిపి, వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని డిజిపి హామీ ఇచ్చినట్టు వారు ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాలలో ఉద్యోగకల్పన కోసం నిర్వహించిన స్టడీ సర్కిల్ వేదికగా మహిళలను ట్రాప్ చేశారని ఐద్వా నేతలు ఈ సందర్భంగా తెలిపారు. ఈ దుశ్చర్యలో టౌన్ ఎస్ఐ, సిఐల పాత్రతో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రముఖుల పాత్ర ఉన్నట్టుగా తెలుస్తున్నదని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్న ఈ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మార్కెట్లలో కొనుగోళ్ల జోష్


సెన్సెక్స్‌కు 1,181 పాయింట్ల లాభం

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో సాగాయి. అంతర్జాతీయ సానుకూల పరిణామాల మద్దతుతో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1,181 పాయింట్లు పెరిగి 61,795కు చేరింది. ఇదే బాటలో ఎన్ఎస్ఇ నిఫ్టీ 321 పాయింట్లు రాణించి 18,349 వద్ద ముగిసింది. ఉదయం నుంచి మార్కెట్లు దూకుడును ప్రదర్శించాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 52 వారాల గరిష్టానికి చేరాయి. బిఎస్ఇలో ఒక్క పూటలోనే మదుపర్ల సంపద రూ.3.6 లక్షల కోట్లు పెరిగింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్, టిసిఎస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. వరుసగా నాలుగో నెలా అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గడంతో అక్కడి మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. ఇది భారత మార్కెట్లలోనూ విశ్వాసం నింపింది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్క శాతం పెరగడం సూచీలకు కలిసి వచ్చింది. ఎఫ్ఐఐల కొనుగోళ్లు పెరిగాయి.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

- రాష్ట్రాలపై బెదిరింపు ధోరణి సరికాదు
- పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలి
- ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నదని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపిఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ విమర్శించారు. జాతీయ పెన్షన్ పథకంలో వ్యక్తిగత చందాదారులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దాచుకున్న సొమ్మును తిరిగి తీసుకునేందుకు చట్టం అనుమతించడంలేదంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్‌లో ఉన్న ఆ సంఘం కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ఇవ్వబోమంటూ రాష్ట్రాలపై బెదిరింపు ధోరణి సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సొమ్ముపై కేంద్రం పెత్తనమేంటని ప్రశ్నించారు. అంతిమ యాజమాన్య హక్కు ఉద్యోగిదే అని అన్నారు. పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టం ప్రకారం జాతీయ పెన్షన్ పథకంలో చేరడమనేది రాష్ట్రాలకు ఒక ఆప్షన్ మాత్రమేనని చెప్పారు. దాన్ని వద్దనుకున్నప్పుడు తిరిగి వెనక్కి వెళ్లొచ్చంటూ ఉందనీ, ఎలా వెళ్లాలో మాత్రం చట్టంలో చెప్పలేదని వివరించారు. అంతమాత్రాన రాష్ట్రాలు వెనక్కి వెళ్లే అవకాశం లేదంటూ ఆర్థిక మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇది పూర్తిగా గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే ఎన్నికల్లో భాగంగానే ఆమె ఆడుతున్న వింత నాటకమని అన్నారు. ఇప్పటికే రాజస్థాన్ సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించిందని గుర్తు చేశారు. పెన్షన్ ఫండ్ ఇవ్వాలంటూ పిఎఫ్‌ఆర్‌డిఎకు లేఖ రాసిందని వివరించారు. పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టంలో పదేండ్లలో ఈ పెన్షన్ పథకం ఉద్యోగుల ఆర్థిక, సామాజిక భద్రతలో సఫలీకృతం కాకపోతే ఆ చట్టాన్ని రద్దు చేసుకోవచ్చన్న అంశం కూడా ఉందని గుర్తు చేశారు. ఇంతటి గ్యారంటీ లేని పెన్షన్ పథకాన్ని చట్టాన్ని 18 ఏండ్లయినా ఇంకా కొనసాగించడమంటే ఉద్యోగులను మోసం చేస్తున్నట్లేనని విమర్శించారు. పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనూ ఎన్పీఎస్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలనీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.20 వేల కోట్లను వెనక్కి తేవాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, నాయకులు కోటకొండ పవన్, సత్యనారాయణ, సమీనా కాటూన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులను కాలరాస్తే ఉద్యమం

- 'అటవీ సంరక్షణ నియమాలు-2022'ను ఉపసంహరించాలి
- 15న నియమాల ప్రతుల దగ్ధం
- ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన హక్కులను కాలరాస్తే ఉద్యమం తప్పదని ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అటవీ సంరక్షణ నియమాలు-2022ను ఉపసంహరించుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే రైతాంగ ఉద్యమం తరహాలో గిరిజన సంరక్షణ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఆదివాసీ విప్లవ వీరుడు బిర్సా ముండా 147వ జయంతి సందర్భంగా ఈ నెల 15న కార్పొరేట్ అనుకూల 'అటవీ సంరక్షణ నియమాలు -2022' ప్రతుల దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని వారు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ కన్వీనర్లు వేములపల్లి వెంకట్రామయ్య, అంజయ్య నాయక్, తెలంగాణ గిరిజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్, ఇండియన్ నేషనలిస్టు మూమెంట్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) నాయకులు ప్రసాదన్న, ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామయ్య మాట్లాడుతూ ఆదివాసీల మీద మోడీ ప్రభుత్వం అప్రకటిత యుద్ధం ప్రకటించిందని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా రూపొందించిన అటవీ హక్కుల చట్టం-2006, పీసా చట్టం-1996, భూసేకరణ పునరావాస నష్టపరిహారం చట్టం-2013 తదితరాలను, వాటిలోని నియమాలను తుంగలో తొక్కి.. 'నూతన అటవీ సంరక్షణ నియమాలు-2022'ను మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్నదని చెప్పారు. ఇది పూర్తిగా కార్పొరేట్ అనుకూల విధానమేనని తెలిపారు. కోట్లాది మందికి జీవనాధారంగా ఉన్న అడవులను కాపాడుకోవాలనీ, పర్యావరణ పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పోడు భూముల సమస్యను పరిష్కరించటంలోనూ, పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వటంలో కేసీఆర్ ప్రభుత్వం అనుసరిస్తున్న నాన్చుడు ధోరణి తగదని సూచించారు. శ్రీరాంనాయక్ మాట్లాడుతూ ఆదివాసుల జీవితాలను నాశనం చేసే 2022 అటవీ నియమాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోడు సాగుదారులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయించటాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. అంజయ్యనాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గిరిజన వ్యతిరేక విధానాలను మానుకోవాలన్నారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణం దెబ్బతింటే.. మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం అడవులను అంతం చేయొద్దని మోడీకి సూచించారు.